


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 29 మే 2025 పేజీలు 8




## నేటి తరానికి ఆదర్శం

# ఎన్టీఆర్ జీవితం

కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శం అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని మచిలీపట్నం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో జిల్లాస్థాయి వేడుకలను జిల్లాయంత్రాంగం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, రాష్ట్ర శాసనసభ ఎథిక్స్ కమిటీ అధ్యక్షులు, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తో కలసి మాజీ ముఖ్యమంత్రి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిగతా 2లో...



## ఎన్టీఆర్ కీర్తిప్రతిష్టలు

# అజరామరం

- బృంద స్ఫూర్తితో ఎన్టీఆర్ (జిల్లా) కీర్తిని ఇనుమడింపజేద్దాం
- ఎన్టీఆర్ ఆశయాల స్ఫూర్తితో సేవలందిద్దాం
- స్వర్ణాంధ్ర @2047 లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషిచేద్దాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

2లో

# ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం

- కిలో రెండు రూపాయలకే బియ్యం పథకం ఎన్టీఆర్ ఘనతే
- సామాన్యుడిగా పుట్టి ఎంతోమందికి ఎన్టీఆర్ ఆదర్శం
- కాపులకు అన్నివిధాలా రుణాలు అందిస్తాం
- పేద వాడికి న్యాయం అందించేందుకు ఎన్టీఆర్ నిరంతరం కృషి చేశారు
- ఏపీ రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు




**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** సామాన్య కుటుంబంలో పుట్టి ఎంతో ఎత్తుకు ఎదిగిన మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టీ.రామారావు నేడు ఎంతో మందికి ఆదర్శప్రాయుడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టీ.రామారావు జయంతి సందర్భంగా బుధవారం కాపు కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ దేశ,

మిగతా 2లో

# నిర్లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మాణం

- మార్జిన్లు పోయకుండా వదిలేసిన వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

2





(మొదటిపేజీ తరువాయి)

## ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం

విదేశాల్లో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. పేదవర్గాలకు అండగా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టీ.రామారావుకు దక్కుతుందన్నారు. ఆయన పార్టీని స్థాపించిన 9 నెలల కాలంలోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారన్నారు. ఎన్.టీ.రామారావు ముఖ్యమంత్రి అయ్యాకే ప్రజాప్రతినిధులు గురించి అందరికీ తెలిసిందన్నారు. కిలో రెండు రూపాయలు, ఆడపిల్లకు ఆస్తి హక్కు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చి, రాష్ట్రంలో రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఎంతోమంది యువతకు రాజకీయ అవకాశాలు కల్పించారన్నారు.సినీ, రాజకీయాల్లో ఎంతో ఎత్తుకు ఎదిగిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టీ.రామారావు అని అన్నారు. ఆయనతో పనిచేయడం ఎంతో గర్వకారణం అన్నారు. సినిమాల్లో శ్రీకృష్ణుడిగా, వెంకటేశ్వరస్వామిగా, ఆయన చేసిన పౌరాణిక, సాంఘిక సినిమాలు ఎంతోమందికి ఆదర్శమన్నారు. మేమంతా ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామన్నారు. ఆయన బాటలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు పయనిస్తున్నారన్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ ఆశయాల అమలుకు ముందుకు సాగుతోందన్నారు. కాపు కార్పొరేషన్ 2014 కు ముందు లేదని ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాకే 2015 సంవత్సరంలో ఏర్పాటు చేశారన్నారు. కాపులను సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన వర్గాలతో సమానంగా తీసుకొచ్చే లక్ష్యంగా కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ భరోసా, చంద్రన్న విదేశీ విద్యా దీవెన, దీపం, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్స్ లు అందిస్తున్నామన్నారు.. కాపు కార్పొరేషన్ రిజల్ట్ ఓరియెంటెడ్ గా పని చేస్తుందని, ఒక్క ఏడాది లోగానే ఆ ఫలితాలను చూపిస్తామన్నారు. స్వయం ఉపాధి పథకాలు కోసం అర్హులైన కాపులు అందరికీ రుణాలు ఇప్పిస్తామన్నారు.ప్రభుత్వం కాపు కార్పొరేషన్ కింద అన్నీ కలుపుకొని రూ. 4,600 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. కాపు భవనాలు 4 చోట్ల తప్ప మిగిలిన చోట కాన్సిల్ చేశారని, రివ్యూ చేసి కాన్సిల్ చేసిన వాటిని పునరుద్ధరిస్తామన్నారు. గృహిణి అనే ఒక కొత్త స్కీమ్ కూడా తేవాలని ప్రభుత్వం యోచిస్తుందని, ఆ పథకం కింద మొత్తం కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఆర్థికంగా చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునేలా చేయూత అందిస్తామన్నారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వడంలో ఇబ్బందులు ఉండవని, కూటమి ప్రభుత్వంపై బ్యాంకర్లకు ఎంతో నమ్మకం ఉందన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టీ.రామారావు జయంతి సందర్భంగా కాపు కార్పొరేషన్ చైర్మన్ కేకు కట్ చేసి, నివాళులు అర్పించారు..కార్యక్రమంలో కాపు కార్పొరేష్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. కృష్ణమూర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మాణం

**మార్జిన్లు పోయకుండా వదిలేసిన వైనం**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు**



**కంచికచర్ల మే 28 మేజర్ న్యూస్ :** స్థానిక డివిఆర్ కాలనీలో సిసి రోడ్ల నిర్మాణం జరిగి రెండు నెలలు పూర్తి అయినప్పటికీ మార్జిన్లు పోయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాదచారుల, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది.సిమెంట్ రోడ్డు ఇరుపక్కల మార్జిన్ లో పోసేందుకు తోలిన గ్రావెల్ రోడ్డు పక్కనే దర్శనమిస్తుంది. రెండు నెలలు పూర్తయి వర్షాకాలం సమీపించినప్పటికిని రోడ్డుకిరుపక్కల గ్రావెల్ పరచకపోవడంతో నిత్యం కాలనీ వాసులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల బారిన పడి ఆస్పత్రి పాలవాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా మోడల్ కాలనీ లో సుమారు 10 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. మార్జిన్లు పోసేందుకు తోలిన గ్రావెల్ ని మాత్రం వదిలేసి వెళ్లారు. ఈ విషయమై సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తుంది. రెండు నెలలుగా కాలనీకి చెందిన పాదచారులు,ద్విచక్ర వాహనదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా చెప్పాలి.సిమెంట్ రోడ్డు ఎత్తుగా ఉండి ఎటువంటి వాహనాలు రాకపోకలకు వీలు లేకుండా ఇబ్బందికరంగా మారింది. ఓ పక్క ఎత్తైన సిమెంట్ రోడ్డు మరోపక్క గ్రావెల్ కుప్ప అడ్డంగా ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు తక్షణమే నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్ల మార్జిన్లు పోయించి ప్రజల,వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్ ని వివరణ కోరగా సంబంధిత కాంట్రాక్టర్కు మోడల్ కాలనీ సీసీ రోడ్లకు ఇరుపక్కల గ్రావెల్ పరచవలసినదిగా తెలిపామన్నారు. మరొకసారి పరిశీలించి తక్షణమే పోయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.

# నేటి తరానికి ఆదర్శం ఎన్టీఆర్ జీవితం

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగినా ఎప్పుడూ కూడా దర్పాన్ని ప్రదర్శించలేదని, ముఖ్యమంత్రిగా సుపరిపాలన అందించి పేద ప్రజల పక్షాన నిలిచారని కొనియాడారు. ఎన్టీఆర్ మేటి హీరోగా కొనసాగుతున్న రోజుల్లో తిరుపతి దర్శనానికి వెళ్లే భక్తులు, దర్శనం అనంతరం ఎన్టీఆర్ ను చూడడానికి మద్రాసులోని ఆయన నివాసానికి వెళ్లేవారని, వచ్చిన వారిని ఆయన నిరాశపరచకుండా ప్రతి ఒక్కరిని నిత్యం పలకరించి ప్రజల మనిషిగా పిలవబడ్డారని నాటి సంగతులను ఆయన గుర్తు చేశారు. పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది నెలల్లో ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేవలం ఫిలిం స్టార్ అయ్యుండటం ఒక్కటే కారణం కాదని, దానికి తోడు ఆయన ఆ రోజుల్లో సౌకర్యవంతంగా లేని రోడ్లలో చిన్నపాటి వాహనాల్లో ప్రయాణించి గ్రామ గ్రామానికి తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారని, ఎంతో శ్రమించి పట్టుదల, కృషితో ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత సామాన్య ప్రజల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని, గ్రామాలలో కరణం వ్యవస్థను రద్దుచేసి గ్రామ రెవెన్యూ అధికారుల ఏర్పాటు, మహిళలకు ఆస్తిలో సమాన ఆస్తి హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్లు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో సుపరిపాలన అందించారన్నారు. సినిమా రంగం నుంచి రాజకీయ రంగం వరకు ఆయన జీవితం ఎంతో ఆదర్శవంతమైనదని పేర్కొంటూ ఆయనకు వచ్చిన విజయం ఆయన చేసిన కృషి, పట్టుదల, శ్రమతోనే అది సాధ్యమైందని, నేటి తరం ఆయనను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణాజిల్లాలోని నిమ్మకూరు గ్రామంలో పుట్టి తెలుగు జాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఎన్టీఆర్ ఎప్పుడూ రాజకీయాన్ని రాజకీయంగా చూడలేదని, ప్రత్యర్థులను సాధించ నూలేదని, వారిని స్నేహభావంతో చూశారని, గౌరవించి, ప్రేమించారని అలాంటి గొప్ప వ్యక్తిత్వం గల మహనీయుడని కీర్తించారు. తెలుగు భాష, తెలుగు జాతి గుర్తింపు కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి లక్ష్యాన్ని సాధించారన్నారు. తన సినిమాలతో ఎన్టీఆర్ సమాజంలో మంచిని ప్రేరేపించారని, జాతి చరిత్రను భావితరాలకు తెలియజేశారన్నారు. ఆయన సినిమాలకు ప్రభావితం కానీ వ్యక్తులు ఉండరనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని, తాను చదువుకుంటున్న రోజుల్లో ఎన్టీఆర్ వీరాభిమాని అని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.జిల్లా



రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, కూటమి నాయకులు బండి రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ తదితరులు ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవిత విశేషాలపై ప్రసంగించారు.కార్యక్రమంలో శివజ్యోతి విద్యాలయ నాట్య బృందం తదితర చిన్నారులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, అదేవిధంగా ఆంజనేయులు, లిఖిత బృందం ఆలపించిన భక్తి, దేశభక్తి ప్రబోధాత్మక గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రోషిత శ్రీవల్లిక అనే చిన్నారి కళ్ళకు గంతలు కట్టుకొని గుర్తింపు కార్డులు చదవటం, హాల్లో ప్రత్యేకంగా వ్యక్తులను గుర్తించడం, చూడకుండా బ్లాక్ బోర్డుపై చిత్రాన్ని గీయడం, సైకిల్ తొక్కడం వంటి గాంధార విద్య ప్రదర్శన ఆహుతులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జీవిత విశేషాలతో ఏర్పాటుచేసిన ఏవి డిస్ప్లేను అందరూ తిలకించారు.

అనంతరం జిల్లా కలెక్టర్, అవనిగడ్డ శాసనసభ్యులు, డిఆర్ఓ, బందరు ఆర్డిఓ తదితర అధికారులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జీవిత విశేషాలతో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ హాల్లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకించారు. సినీ రంగంతో పాటు రాజకీయ రంగంలోని ప్రముఖ వ్యక్తులతో కలిసి ఉన్న ఫోటోలు, కుటుంబ, వ్యక్తిగత విశేషాలను తెలియజేసే ఛాయాచిత్ర ప్రదర్శనను అధికారులతో పాటు జయంతి వేడుకలకు విచ్చేసిన వారు ఆసక్తిగా తిలకించారు.ఈ కార్యక్రమంలో కే ఆర్ ఆర్ సీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, బందరు ఆర్డీవో కే స్వాతి, జడ్పీ ఇన్చార్జ్ సీఈఓ ఆనంద్ కుమార్, స్థానిక నాయకులు దిలీప్, వెంకటస్వామి, రెడ్ క్రాస్ సంస్థ సెక్రెటరీ శంకర్ నాథ్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కీర్తిప్రతిష్టలు అజరామరం







**బృంద స్ఫూర్తితో ఎన్టీఆర్ (జిల్లా) కీర్తిని ఇనుమడింపజేద్దాం**

**ఎన్టీఆర్ ఆశయాల స్ఫూర్తితో పేదలకు సేవలందిద్దాం**

**స్వర్ణాంధ్ర @ 2047 లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషిచేద్దాం**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మే 28, మేజర్ న్యూస్ :** సాధారణ ఉద్యోగిగా కళామతల్లి ముద్దుబిడ్డగా పేద ప్రజల గుండె చప్పుడుగా క్రమశిక్షణతో జీవితాన్ని కొనసాగిస్తూ స్వర్గీయ నందమూరి తారకరామారావుఅందుకున్న కీర్తిప్రతిష్టలు అజరామరమని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని పేదలకు సేవలందించడం ద్వారా ఎన్టీఆర్ జిల్లాకు మరింత ఖ్యాతిని తీసుకొద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. పూర్వ ముఖ్యమంత్రివర్యులు, కళామతల్లి ముద్దుబిడ్డ స్వర్గీయ నందమూరి తారకరామారావుగారి జయంతిని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత ఎన్టీఆర్ జీవిత విశేషాలపై జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి అనంతరం కళాక్షేత్ర నాట్య అకాడమీ, భాగవతుల వెంకటరామ శర్మ శిష్యబృంద సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు జాతి గర్వపడే విధంగా స్వర్గీయ నందమూరి తారకరామారావు అమలుచేసి విప్లవాత్మక పరిపాలనా సంస్కరణలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలనే లక్ష్యంతో రూ. 2కే కిలోబియ్యం పథకంతో పాటు మండల విధానం ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువచేయాలనే ఉద్దేశంతో సాహసోపేత నిర్ణయాలను తీసుకున్న మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. సామాన్య రైతు కుంటుంబంలో జన్మించిన ఎన్టీఆర్ ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి కళారంగంలో ప్రవేశించారన్నారు. నవరస నటనా చాతుర్యంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ నటనకే వన్నె తెచ్చారన్నారు. దివిసీమ ఉప్పెన రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టినప్పుడు ప్రజలను ఆదుకునేందుకు సామాజిక స్పృహ కలిగిన కళాకారుడిగా జోలు పట్టి విరాళాలు సేకరించి బాధితులకు అండగా నిలిచారన్నారు. రాజకీయ నాయకుడిగా రంగప్రవేశం చేసి అతి తక్కువ సమయంలోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ప్రజా కేంద్రీకృత పరిపాలన సాగించారన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లుగా భావించి పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా ఆయన తీసుకున్న నిర్ణయాలు నేటికీ చిరస్థాయిగా కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ చూపిన మార్గంలో పరిపాలన అందిస్తూ స్వర్ణాంధ్ర సాధనకు కృషిచేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి పునరంకితమై, పేదరికం లేని సమాజం కోసం పాటుపడాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

**తెలుగు జాతి ఖ్యాతికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చిన మహనీయుడు:** తెలుగుజాతి ఖ్యాతికి ప్రపంచ స్థాయిలో గుర్తించి తెచ్చిన మహనీయుడు స్వర్గీయ ఎన్టీఆర్ అని నాట్యాచార్యులు భాగవతుల వెంకటరామ శర్మ అన్నారు. ఎన్టీఆర్ ఆశయాల స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఎన్టీఆర్ జీవితంలోని కీలక ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్.శ్రీనివాస్రెడ్డి, పర్యవేక్షకులు ఎం.దుర్గాప్రసాద్, డీఐపీఆర్వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్వో ఎస్వీ మోహనారావు, డివిజనల్ పీఆర్వో కె.రవి, మీడియా సమన్వయకర్త వీవీ ప్రసాద్, డీఈవో యూవీ సుబ్బారావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ భన్సీ, డిప్యూటీ డైరెక్టర్ చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

# రాధా కృష్ణమూర్తిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఘంటసాల గ్రామ కరణంగా పనిచేసిన ఘంటసాల రాధాకృష్ణమూర్తిని, చల్లపల్లి ఆర్ ఐ కృష్ణమోహన్ లను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్, అవనిగడ్డ మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు బుధవారం పరామర్శించారు. రాధాకృష్ణమూర్తి భార్య, కృష్ణమోహన్ తల్లి గారైన ఘంటసాల విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. స్వగ్రామం ఘంటసాల గ్రామం అయినా.. ప్రస్తుతం వీరు చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని రామానగరంలో నివాసం ఉంటున్నారు. సింహాద్రి రమేష్ బాబు రామానగరంలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. తొలుత ఘంటసాల విజయలక్ష్మి చిత్రపటం వద్ద పుష్పగుత్యాలు ఉంచి నివాళులు అర్పించారు. భగవంతుడు ఆమె ఆత్మకు శాంతి కలిగించాలని ప్రార్థించారు. అనంతరం రాధాకృష్ణమూర్తి, కృష్ణమోహన్లకు ఓదార్చారు. గుండె నిర్భరం చేసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని ధైర్యం చెప్పారు. సింహాద్రి రమేష్ బాబు వెంట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చల్లపల్లి మండలం కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ, పార్టీ నాయకులు



వెనిగళ్ళ తారక జగదీష్, ఎడ్ల జగదీష్, జుజ్జువరపు భాగ్య రావు, మోదుమూడి కుటుంబరావు, చింతలమడ బాబి, మోదుమూడి శ్రీనివాసరావు, కొల్లూరు ముద్దుకృష్ణ, పి శివరాం, ముచ్చు శ్రీను, కొమ్మన కోటేశ్వరరావు, నాయుడు చంద్రశేఖర్ (పెద్దారెడ్డి), ముచ్చుబాను తదితరులు ఉన్నారు.

## అందరికి స్ఫూర్తి ప్రధాత శిరింగి కిరణ్‌కుమార్

**నివాళులు అర్పించిన యువనాయకులు గద్దె క్రాంతి కుమార్**



**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** శిరింగి కిరణ్ కుమార్ (బబ్లు) డాన్స్ మాస్టర్‌గా ఎదిగి, ఎంతోమందికి తన విద్యను నేర్పి వారికి ఉపాధిమార్గాలు చూపించడమే కాకుండా తాను రోడ్డు ప్రమాదంలో మరణించిన తర్వాత కూడా తన శరీరంలోని అవయవాలు దానం చేసి కొందరికి ప్రాణదాతగా మారాడాని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కుమారుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన క్రీస్తురాజపురానికి చెందిన కిరణ్‌కుమార్ భౌతిక కాయానికి గద్దె క్రాంతికుమార్ బుధవారం సున్నపుబట్టీల సెంటర్ అమ్మ కళ్యాణమండపం దగ్గర సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కిరణ్‌కుమార్ కుటుంబసభ్యులకు గద్దె క్రాంతికు మార్ రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందచేశారు. అనంతరం జరిగిన అంతి మయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవించి ఉన్నప్పుడే కాకుండా చనిపోయిన తర్వాత కూడా సహాయం చేసే గుణం ఉన్న కిరణ్‌కుమార్‌లోని స్ఫూర్తి నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.



## మహానాడులో వీరులపాడు మండల టీడీపీ శ్రేణులు



**వీర్లపాడు, మే 27, మేజర్ న్యూస్:** కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో వీరులపాడు మండలం వెల్లంకి, గోకరాజుపల్లి, బోడవాడ గ్రామాల నాయుకులునందిగామ ఎన్నిక పరిశీలకులుబోస్, మాజీ మంత్రి ఉమామహేశ్వరావు ని కలిసారు. ఈసారి కడపలో జరుగుతున్న మహా నాడు వేడుకులు చాలా అద్భుతంగాజరుతున్నాయని, అదే వీధంగా వసతి సౌకర్యం కూడా బాగుంది అని నాయుకులు చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమం లో మల్లెల శ్రీనివాసరావు, మద్దినేని లక్ష్మణరావు, మల్లెల శ్రీ కృష్ణ వాసు, చంద్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతను పరామర్శించిన బండే శ్రీనివాసరావు



**కోడూరు మేజర్ న్యూస్ :** నిన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మందపాకల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అద్దంకి రవి కృష్ణ ప్రసాద్‌ను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు అడిగి తెలుసుకుంటున్నారు. వీరితోపాటు కోడూరు టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూతబోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లికార్జున రావు, మందపాకల సాగునీటి సంఘం అధ్యక్షులు అప్పికట్ల రవీంద్రబాబు, క్లస్టర్ ఇంచార్జ్ కొక్కిలిగడ్డ జాన్ విల్సన్ తదితరులు రవి కృష్ణ ప్రసాద్ పరామర్శించిన వారిలో ఉన్నారు.

## మాజీ ఎంపీటీసీ సభ్యులని పరామర్శించిన చైర్మన్ చిలకలపూడి పాపారావు



**నాగాయలంక మేజర్ న్యూస్:** ఇటీవల కాలుజారి గాయపడిన మాజీ ఎంపీటీసీ సభ్యులు కొక్కిలిగడ్డ శ్రీనుని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు పరామర్శించారు. చైర్మన్ తో అవనిగడ్డ వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కొల్లాటి ధనంజయరావు, టీడీపీ సీనియర్ నాయకులు తమ్ము ధర్మరాజు, చిలకలపూడి నారాయణరావు, కొక్కిలిగడ్డ రాఘవేంద్రరావు, మోదే నాగేశ్వరరావు, తమ్ము నాగేశ్వరరావు, తమ్ము తాతారావు, కొక్కిలిగడ్డ కోటేశ్వరరావు, తమ్ము రమణయ్య, విశ్వనాథపల్లి నరసింహారావు, దాసరి శేఖర్, నాయుడు వెంకటేశ్వరరావు, అంద్రాజు రవి, బొడ్డు రామ్మోహన్రావు, దాసరి శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# భారత్‌లో రియల్ మీ జీటీ 7 సిరీస్ ఆవిష్కరణ



**విజయవాడ, మే 28, మేజర్ న్యూస్ :** రియల్ మీ అనేది యువతలో అత్యధిక పేరు గాంచిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్. అది ఈరోజు ఊహించని రియల్ మీ జి టి 7 సిరీస్ ని ఇండియాలో లాంచ్ చేసింది, అది పేరిస్ లో చేసిన గ్లోబల్ లాంచ్ తో సింక్ లో ఉంటుంది. ప్రకటన కి హెడ్ లైన్ గా రియల్ మీ జి టి 7 డ్రీమ్ ఎడిషన్ ని యాస్టన్ మార్టిన్ ఫార్ములా వన్ టీమ్ తో కలిసి సృష్టించింది, అది దాని అధికారిక పరిచయాన్ని ఏ ఎం ఎఫ్ 1 యొక్క సహ బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్‌గా పరిచయం చేసింది.పరిశ్రమ లో మొదటి ఫీచర్స్‌తో, పనితీరు అప్ గ్రేడ్ లతో రియల్ మీ జి టి 7 సిరీస్ రియల్ మీ యొక్క తెలివైన దశ తో పాటు ఫ్లాగ్ షిప్ స్మార్ట్‌ఫోన్ అనుభవాన్ని భారత వినియోగదారులకు అందిస్తుంది." రియల్ మీ జి టి 7 సిరీస్‌తో, 2025లో ఫ్లాగ్‌షిప్ కిల్లర్‌గా ఉండటం అంటే ఏమిటో మేము పునర్నిర్వచించుకుంటున్నాము. ఇది కేవలం అగ్రశ్రేణి స్పెక్స్ గురించి మాత్రమే కాదు, నేటి యువత ఆకాంక్షలతో ప్రతిధ్వనించే విధంగా శక్తి, తెలివితేటలు, నైపుణ్యాన్ని మిళితం చేసే పూర్తి అనుభవాన్ని అందించడం గురించి. ఆస్టన్ మార్టిన్ ఫార్ములా వన్ బృందంతో కలిసి సృష్టించబడిన మా డ్రీమ్ ఎడిషన్ ప్రారంభం నుండి, ఏ ఐ ప్లానర్, ఐస్‌సెన్స్ గ్రాఫేన్ కూలింగ్ వంటి ఆవిష్కరణల వరకు, ప్రతి వివరాలు సరిహద్దులను అధిగమించడానికి రూపొందించబడ్డాయి. ప్రీమియం అనుభవాలను అందుబాటులోకి తీసుకురావడానికి, కోరదగినదిగా, నిస్సందేహంగా పనితీరు-ఆధారితంగా చేయడానికి, అత్యాధునిక సాంకేతికతను ప్రజాస్వామ్యీకరించడానికి మా ప్రయాణంలో జిటి7సిరీస్ ఒక సాహసోపేతమైన ముందడుగు. అని రియల్ మీ యొక్క వ్యాఖ్యాత లాంచ్‌లో మాట్లాడుతూ అన్నారు." జిటి7 యొక్క రియల్ మీ యొక్క కలయికతో దాని నిబద్ధత ని ఫ్లాగ్ షిప్ ఆధునీకరణ తో భారత వినియోగదారులకు చేరువ చేస్తుంది. ఇండియాలో మొదటి స్మార్ట్‌ఫోన్ లా మీడియా టెక్ డిమెన్సిటీ 9400 ఈ ని అందిస్తుంది. ఈ లాంచ్ అనేది భారత దేశంలో మొదటి చొరవ కి నిజమైన మైలు రాయి. 4ఎన్ఎం పెద్ద కోర్ మీడియా టెక్ డిమెన్సిటీ 9400ఇ కార్టెక్స్ ఎక్స్4 కోర్‌లను ఉపయోగిస్తుంది, అది శక్తివంతమైన ఇమ్మోర్టల్‌ఎల్ఐవిస్-జి 720 ఎం సి 12 జి పి యు ని స్మార్ట్, సమాధానం చెప్పగలిగే, సఖి సామర్థ్యం కలిగిన అనుభవాలను అందిస్తుంది, అది వినియోగదారుల నిజమైన అవసరాలకు తగ్గట్టు ఉంటుంది." అని మార్కెటింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్ లకు మీడియా టెక్ డైరెక్టర్ అనుజ్ సిద్దార్థ్ అన్నారు.

## కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే బదిలీలు జరగాలి



**విజయవాడ, మేజర్ న్యూస్ :** పశు సంవర్ధక శాఖ బదిలీల్లో అవకతవకలు కొనసాగుతున్నాయని, తక్షణమే కౌన్సెలింగ్ పద్ధతి ద్వారా బదిలీల ప్రక్రియను నిర్వహించాలని పశు సంవర్ధకశాఖ గెజిటెడ్ అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం ఆ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు జేఏసీ చైర్మన్ సిహెచ్.ఎస్. కృష్ణారావు, కోచైర్మన్లు డాక్టర్ గణేశ్వరరావు, జి.రవి బాబు, న్యాయ సలహాదారు బోడపాటి సుధీర్ కుమార్ తదితరులు కలిసి విన్నవించారు. పూర్తి స్థాయిలో కొనసాగుతున్న రాజకీయ బదిలీలపై ప్రభుత్వ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలన్నారు. కౌన్సిలింగ్ పద్దతి ద్వారా బదిలీల ప్రక్రియ జరిగితేనే పారాదర్శకత ఉంటుందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై బుడితి రాజశేఖర్ స్పందిస్తూ, ఆ శాఖ సంచాల కులు దామోదర నాయుడుతో మాట్లాడి, పూర్తి స్థాయిలో పారదర్శకంగా బదిలీలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు.

## ఎన్‌టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 31న జాబ్‌డ్రైవ్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ శనివారం విజయవాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ డ్రైవ్‌లో దాదాపు 10 ప్రముఖ కంపెనీలు 200 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయన్నారు. శాండ్‌స్పేస్ టెక్నాలజీస్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్, హెచ్1 హెచ్ఆర్‌లో కస్టమర్ సపోర్ట్ అసోసియేట్, డేటా వ్యాలీ కంపెనీలో ట్రైనర్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ముత్తూట్ ఫైనాన్స్‌లో బ్రాంచ్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, వరుణ్‌మోటార్స్ కంపెనీలో సర్వీస్ అడ్వయిజర్లు, టెక్నీషియన్లు, అడ్మిషన్ యారో అండ్ అకడమిక్ ఓవరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కౌన్సిలర్లు, డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో సేల్స్ అండ్ లోన్స్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్, రిలేషన్‌షిప్ మేనేజర్, ఫాక్స్‌కాన్ కంపెనీలో ఆపరేటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని, వీరికి ఉద్యోగాలనుబట్టి నెలకు రూ. 12 వేలు నుంచి రూ. 40 వేల వరకు జీతం, భోజన, వసతి, రవాణా సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీన ఎన్‌టీఆర్ వికాస కార్యాలయం, కలెక్టరేట్, విజయవాడలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు జెరాక్సులతో హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 98494 65427 నంబరులో సంప్రదించాలని పీడీ లచ్చారావు సూచించారు.

## ఈ నెల 30న జాబ్ మేళా

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డి ఆర్ డి ఎ – సీడాప్ సంయుక్త అద్వర్యంలో, జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను ది.30.05.2025 శుక్రవారం విజయవాడ లోని "కాకరపర్తి భావనారాయణ (కే.బీ.ఎన్) కాలేజ్, విజయవాడ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం, ఎన్టీఆర్ జిల్లా"లో "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వై. సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు సంయుక్తంగా తెలియజేసారు.ఈ జాబ్ మేళాలో, 12 ప్రముఖ కంపెనీ వారు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు పదవ తరగతి, ఐటిఐ, డిప్లమా, ఇంటర్మీడియట్, ఎనీ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపికఅయిన వారికి నెలకి సుమారు రూ.12,000ల నుండి రూ.35,000ల వరకు వేతనముతో పాటు ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, మే 30 న నిర్వహించబోయే ఈ జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు ఏపీయస్ యస్ డీసీ సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు.ఆసక్తి, తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://tinyurl.com/jobmela-naipunyam లింక్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయ్యి, సదరు జాబ్ మేళాకు రెజ్యూమెలతో లేదా బయోడేటా ఫోరమ్ లతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, మరిన్ని వివరాలకు 9700092606 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

## గుంతలు మయమైన రోడ్లను వెంటనే అభివృద్ధి చేయాలి

**మొవ్వ మేజర్ న్యూస్:** మండలంలో గుంతలు మయమైన ఆర్ అండ్ బి, జెడ్పి రోడ్లను వెంటనే అభివృద్ధి చేయాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులకు నారాయణరావు మాట్లాడుతూ అయ్యంకి నుంచి మొవ్వ కోర్టు వరకు, అగిన పర్రు అడ్డ రోడ్డు నుంచి కూచిపూడి సెంటర్ వరకు, అవిరిపూడి నుంచి కోసూరు వరకు, మొవ్వ (వయా పెదముత్తేవి) కోసూరు వరకు ఆర్ అండ్ బి రోడ్లు, అలాగే మండలంలో గల జిల్లా పరిషత్ రోడ్లను వెంటనే అభివృద్ధి పరచాలని నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# తెలుగుజాతి చరిత్రలో ఎన్టీఆర్ చిరస్మరణీయుడు



### 17, 18వ డివిజన్‌లలో..

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** తెలుగుజాతి చరిత్రలో నందమూరి తారక రామారావు పేరు చిరస్మరణీయమని, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపన అధ్యక్షులుగా ఎన్టీఆర్ పార్టీ శ్రేణుల గుండెల్లో కొలువై ఉంటారని గద్దె క్రాంతి కుమార్ కొనియాడారు. బుధవారం ఉదయం ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని 18వ డివిజన్ రాణిగారితోట నాలుగు రోడ్ల సెంటర్ వద్ద, 17వ గుడ్ మార్నింగ్ టీ స్టాల్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహాలకు గద్దె క్రాంతి కుమార్ పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో ముని పోలిపల్లి, అంబటి కాశి, మొకర రంగమహాలక్ష్మి, వేల్పుల సౌరి, మర్రి వెంకటరమణ, సునాభి, మొకర ఆదిబాబు, కొమెర శ్రీను, పత్తి రామారావు చౌదరి, పుట్ల రమణ, దేవల శ్రీను, వేముల తిరుమల వాసు దండగ శ్రీను, కళ్యాణ్ కిషోర్, వేముల ఎల్లయ్య, సిహెచ్ తిరుపతిరెడ్డి, అలజంగి అప్పారావు, పప్పుల బాబు, మిరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

### ముని పోలిపల్లి ఆధ్వర్యంలో..



తూర్పు శాసనసభ్యులు గద్దె రామమోహన్ ఆదేశాల మేరకు బుధవారం రాణి గారి తోట 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్చార్జి ముని పోలిపల్లి ఆధ్వర్యంలో ముని టవర్ వద్ద అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా యువ నాయకులు ముని కృష్ణ, 17వ డివిజన్ మహిళ అధ్యక్షులు మల్లెల కుమారి, గురజాల మార్కండేయులు, మూల వెంకటేశ్వరరావు (కొండ)చ టిఎన్టియుసి తూర్పు నియోజకవర్గం అధ్యక్షులు రాయవరపు అశోక్ కేక్ కటింగ్ చేసి నివాళులర్పించారు. 17వ డివిజన్ టిడిపి కార్యనిర్వా కార్యదర్శి వేల్పుల శౌరి, మైనార్టీ సెల్ నాయకులు ఎస్.కె మదర్. పూలదండ వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మొకర అదిబాబు, ముని అజయ్, 17వ డివిజన్ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు అవనాపు శ్రీను, దనేకుల వెంకటమ్మ, సారిపల్లి డేవిడ్ రాజ్. రేవులమడుగు నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు బోని తమ్మినాయుడు, కొప్పులు సూర్యవతి, చీపురుపల్లి సాయికుమార్, కిలరి రమణ, కందుబొతు వెంకన్న, ఎర్నింట రమణ తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేషన్‌లో..



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర బుధవారం ఉదయం వీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను సిబ్బందితో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి సృజన, అకౌంట్స్ ఆఫీసర్ బి సత్యనారాయణమూర్తి, ఇంచార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రజల మనస్సులో ఎన్టీఆర్ చిరస్మరనీయుడు

**పొన్నం బాలాజీ, పొందూరు శ్రీనివాసరావు**



**పెనుగంచిప్రోలు, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రజల మనస్సులలో ఎన్టీఆర్ చిరస్మరనీయంగా నిలిచి ఉంటాడని అన్నారు. బుధవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు 102వ జయంతిని పురస్కరించికొని గుమ్మడిదుర్రు ఎన్టీఆర్ సర్కిల్ పాలకేంద్రం వద్ద ఆయన విగ్రహానికి పొన్నం బాలాజీ, పొందూరు శ్రీనివాసరావు, నాగేశ్వరావు, మం దేపూడి రా మ్మోహన్,సామినేని సైదేశ్వరావు, రమేష్, కంచేటి జగ న్నాథం, రాం బాబు జనసేన నాయకులు సూర వెంకట నరసయ్య పూలమాలలు వేసి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనం తరం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులు సమక్షంలో కేక్ కటింగ్ చేసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజల సమక్షంలో ఘన నివాలర్పించారు. ఈ కార్యక్ర మంలో గుమ్మడిదుర్రు గ్రామ నాయకులు, కార్యకర్తలు,ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

### కోడూరు ప్రధాన సెంటర్లో..



**కోడూరు మేజర్ న్యూస్:** ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని తెలుగుదేశం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాసరావు వేములపల్లి కృష్ణ గోగినేని సోమశేఖర రావు వేములపల్లి రాజేష్ పిల్లి మళ్ళీ, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

### కోడూరు ప్రధాన సెంటర్లో..



**కోడూరు మేజర్ న్యూస్ :** స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని బుధవారం కోడూరు ప్రధాన సెంటర్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుటమ నాయకులు బడే గాంధీ బడే వీరబాబు జనసేన మండల పార్టీ అధ్యక్షులు మరే గంగయ్య పోతబోయిన కరుణకుమార్, భీమయ్య పెద్ది భాస్కర రావు, రామారావు, చంద్రరావు, భవనారాయణ నాయకులు పాల్గొన్నారు.

### మొవ్వ సెంటర్లో...



**మొవ్వ మేజర్ న్యూస్:** జయంతి వేడుకలు మండల కేంద్రమైన మొవ్వ సెంటర్లో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, మండల పార్టీ కార్యదర్శి వీరంకి తులసీదాస్, పాల్గొన్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల్లో..

**మొవ్వ (మే 28) మేజర్ న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు 102వ జయంతిని మండల కేంద్రమైన మొవ్వ తహసిల్దార్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే మస్తాన్ ఎంపీడీవో జే విమాదేవి పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

### తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో..



**నందివాడ,మేజర్ న్యూస్:** ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం ప్రజా వేదిక లో నిర్వహించిన జయంతి వేడుకల్లో నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యల వర్తి శ్రీనివాసరావు, గుడివాడ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాం బాబు, రూరల్ మండల అధ్యక్షుడు వాసే మురళి, సీనియర్ టీడీపీ నాయకులు పిన్నమమనేని బాబ్జి, డాక్టర్ గోర్జి సత్యనారాయణ, లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు తదితర నాయకులు పార్టీ శ్రేణులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, జయంతి కేక్ కట్ చేశారు. అనంతరం ర్యాలీగా ఎన్టీఆర్ స్టేడియం వద్దకు చేరుకున్న పార్టీ శ్రేణులు అక్కడ ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి జోహార్ ఎన్టీఆర్ అంటూ నినాదాలు చేశారు.

### కంచికచర్లలో ..




**కంచికచర్ల మేజర్ న్యూస్ :** స్వర్గీయ ఎన్ టి రామారావు 102వ పుట్టినరోజు వేడుకలు కంచికచర్లలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా నాయకులు కార్యకర్తలు దేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ పుట్టినరోజు కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ, మాజీ మండల దేశం పార్టీ అధ్యక్షులు గుత్తా వీర వెంకటరత్నం, పట్టణ పార్టీ అధ్యక్షులు వేమ వెంకటరావు, నన్న పనేని నరసింహారావు, మండల సమైక్య అధ్యక్షురాలు నల్లనాగుల అరుణ,నంబూరు బ్రదర్స్, గుత్తా ఓంకార్, అన్నదాత రామకృష్ణ, బుడ్డి సూర్య ప్రకాష్, అబ్బూరి వెంకట శివ నాగమల్లేశ్వరరావు, గ్రంధి దుర్గారావు, గుత్తా రమేష్, మస్తాన్, శంకర్, రఫీ, జానీ,బర్రె శంకరరావు, పట్టణ మాజీ అధ్యక్షులు పుల్లగుర బాబు, బండ్లమూడి బుజ్జి,డిటిడిసి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### గండేపల్లిలో..



**కంచికచర్ల మేజర్ న్యూస్ :** గండేపల్లి గ్రామం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని నలదిశల వ్యాపింపజేసిన ఘనత ఒక ఎన్టీఆర్ కే దక్కుతుందన్నారు. ఆయన కృషి, పట్టుదల, నిజాయితీలే ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లింది అన్నారు.

### మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు మచిలీపట్నంలో వాడవాడల ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ విశ్వ విఖ్యాత, నటశార్వ భౌమ,పద్మశ్రీ, డాక్టర్ శ్రీ నందమూరి తారకారామారావు 102వ జయంతి వేడుకలు మచిలీపట్నం నియోజకవర్గం లో మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు వాడవాడల ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం బస్టాండ్ సెంటర్లో గల స్వర్గీయ ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆ మహనీయునికి ఘనమైన నివాళులర్పించి స్వర్గీయ ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ పాల్గొని కేక్ కట్ చేసి తదనంతరం స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. పలు డివిజన్లో టీడీపీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్చార్జులు,తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగుదేశం అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..



మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎస్పీతో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, కార్యాలయ, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

### కృష్ణా విశ్వవిద్యాలయంలో..



దేశ స్థాయిలో తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి రామా రావు కె దక్కుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు బుధ వారం కృష్ణా విశ్వవిద్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు 102 వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్ర పటానికి ఉపకులపతి ఆచార్య కె రాంజీ, రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఆర్థిక గణాం కాధికారి రతన్ లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో ఆచార్యులు, సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### చల్లపల్లిలో అట్టహాసంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** తారక రామారావు జయంతిని చల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. చల్లపల్లి ఎన్టీఆర్ పార్క్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ సీనియర్ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు ఎగురవేశారు. అనంతరం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా శ్రీనివాసరావు దంపతులు, మోర్ల రాంబాబు, సీనియర్ నాయకులు మెండు కొండలు కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నివాళులర్పించారు.

### విస్సన్నపేట కలగర గ్రామంలో..



**విస్సన్నపేట మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కలగర గ్రామంలో బుధవారం నందమూరి తారక రామారావు 102 వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గరిమెళ్ళ భాస్కరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### సంక్షేమపాలనకు ఆద్యుడు అన్న ఎన్టీఆర్



**జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ :** విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు తెలుగువారి ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన నాయకుడు రాజకీయాల్లో తిరుగులేని మహానాయకుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 వ జయంతి సందర్భంగా కడప మహానాడు ప్రాంగణంలో నందమూరి తారక రామారావు విగ్రహానికి జగ్గయ్యపేట నియోజకవర్గం టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి సుభాష్, తాటి రామారావు, దోప్పలపూడి నవీన్, దుప్పలపూడి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### గ్రేడ్ వన్ గ్రంథాలయంలో...



**జగ్గయ్యపేట మే 28 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పట్టణంలోని బస్టాండ్ లో ఉన్న గ్రేడ్ 1 శాఖ గ్రంధాలయం జగ్గయ్యపేటలో వేసవి విజ్ఞాన తరగతులు లో భాగంగా బుధవారం మొదటిగా పుస్తక పఠనం చేయించి కథలు చెప్పించడం జరిగింది. అనంతరం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం నకు పూలమాలతో విద్యార్థులు సిబ్బంది కలిసిన నివాళి అర్పించడం జరిగింది. అలాగే గ్రంథాలయ అధికారిని నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర గురించి వివరించినారు. అనంతరం చివరిగా విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ పోటీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిని ఆలేటి ప్రభ సిబ్బంది జే.శ్యామల, బీడీసీ మల్లిక,రమేష్,రాము పాల్గొన్నారు

### మండలంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**పమిడిముక్కల మే 28 మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 102వ జయంతి వేడుకలను పమిడిముక్కల మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ప్రతి గ్రామం లోనూ తెలుగుదేశం పార్టీ జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స్థానిక నాయకులు ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు




పూలమాలలు వేసి నివాళులు అర్పించి తెలుగుదేశం పార్టీ జెండాలను ఎగురవేశారు. మండల పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామంలో జరిగిన వేడుకలలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొల్లిపర వెంకటేశ్వరరావు, లంక ఫణీంద్రరావు, చిగురుపాటి జగదీష్, కొల్లిపర బాబీ, కంచర్ల సురేష్, కొడాలి కోటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. హనుమంతపురం గ్రామంలో లింగమనేని యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బొల్లా మల్లికార్జునరావు, కార్యదర్శి కొల్లూరి జయచంద్, బూత్ కన్వీనర్లు ఇంటూరి రమేష్, రాజులపాటి సాంబశివరావు, రాజులపాటి రామాంజనేయులు, మోపిదేవి శివ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎందూరి పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వం ఎన్టీఆర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేయడంతో మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చోరగుడి గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కందిమళ్ళ పూర్ణ కుమారి, సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్రపల్లి బుడ్డియ్య, చిట్టిమోతు వెంకటేశ్వరరావు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎండిఓ వీర్ల సీతారామరాజు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఓ సీతారామరాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇఓఆర్డి వెంకటేశ్వరరావు, కార్యాలయ ఏవో రామకృష్ణ లతోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పామర్రులో...



**పామర్రు మేజర్ న్యూస్ :** స్వర్గీయ నందమూరి తారకరామారావు స్వగ్రామం ఉన్న మండలం పామర్రులో ఆయన జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పామర్రు సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మహానాడులో ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యేలు



కడపలో జరుగుతున్న 2వ రోజు "మహానాడు" కార్యక్రమంలో భాగంగా స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని పామర్రు, గుడివాడ పెడన శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్ లు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను పరిశీలించారు.

### తోట్లవల్లూరు మండలంలో..



**తోట్లవల్లూరు మే 28 మేజర్ న్యూస్ :** తోట్లవలూరు మండలంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరామ ప్రసాద్, కార్యదర్శి లుక్కా రేణుక రావు, పలువురు నాయకుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు కేకు కట్ చేశారు. పేదలకు కూడు, గూడు, గుడ్డ సమకూర్చాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. అలాగే పేదలకు రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, మద్యపాన నిషేధం, పటేల్ పట్వారి వ్యవస్థ రద్దు వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న మహోన్నతుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.



### కృత్తివెన్ను మండలంలో..

**కృత్తివెన్ను మేజర్ న్యూస్ :** ఎన్టీఆర్ 102 వ జయంతి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎండపల్లి గ్రామంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### బస్ స్టాండ్ సెంటర్ వద్ద



**పెడన, మేజర్ న్యూస్ :** నిన్నటి తరానికి ప్రజానాయకునిగా నేటి తరానికి ఒక యుగపురుషుడిగ తరతరాలను తన్మయులను చేసే శక్తి అన్న నందమూరి తారక రామారావు ది అని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డువేణుగోపాలరావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక బస్ స్టాండ్ సెంటర్ వద్ద గల పార్టీ స్థూపం వద్ద, మఠం వీధిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, మాజీ వైస్ ఛైర్మన్ హన్ను, చందన నారాయణరావు, కమ్మగంటి వెంకటేశ్వరరావు, బట్టా శంకరరావు,పరసా సూర్యనారాయణ,పరసా జితేంద్ర, ఖలీల్ భాష,ఖదీర్, గఫార్,బెజవాడ నాగరాజు,ఖుర్షీద్ బేగం, తదితరులు పాల్గొన్నారు.

### నందిగామపట్టణంలో



**నందిగామ మేజర్ న్యూస్ :** పట్టణంలోని రైతు పేట, గాంధీ సెంటర్, హనుమంతుపాలెం, అశోక్ నగర్ ఏరియాలో నందమూరి తారక రామారావు 102 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వడ్డెల్లి సాంబశివరావు, మండవ పిచ్చయ్య, రాటకొండ కోటేశ్వరరావు, పంగా సతీష్, రాటకొండ చంద్రం, చిరుమామిళ్ల సుబ్బారావు, కాజా తదితరులు పాల్గొన్నారు.

### పల్లగిరి గ్రామంలో..



మండలం లోని పల్లగిరి గ్రామంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి నిర్వహించినారు. పల్లగిరి గ్రామం నాయకులు కార్యకర్తలు అభిమానులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మానుకొండ కృష్ణారెడ్డి, షేక్ సాబ్ జాన్, ముత్తినేని గోపీకృష్ణ మాటాడారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పెదపారుపూడి మండలంలో



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** పెదపారుపూడి మండలంలో ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమా లవేసి నివాళులర్పించారు. కొన్ని గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించడంతోపాటు కేకులను కట్ చేసి పండుగ జరుపుకున్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి చెరు వు గట్టు వద్ద ఆంజనేయ స్వామి గుడి ముందు ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు నాగన్న బోయిన గాంధీ, కార్యదర్శి మేడేపల్లి రవికుమార్, పార్టీ నాయకులు పునేశ్వరరావు, పునుకొల్లు భాను, వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



## జూన్ 1న ఎల్ వీపీఈఐ వైటాథాన్ రన్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో జూన్ ఒకటో తేదీన విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు వద్ద వైటాథాన్ రన్ నిర్వహించనున్నట్టు ఎల్ వీపీఈఐ కోడి వెంకటాద్రి చౌదరి క్యాంపస్ హెడ్ డాక్టర్ అనసువా కపూర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వైటాథాన్ రన్ టీ షర్టును కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ తరహా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. అనసువా మాట్లాడుతూ పిల్లలలో రెటినోబ్లాస్టోమా (కంటి క్యాన్సర్) పై అవగాహన కోసం వైటాథాన్ రన్ నిర్వహిస్తున్నామన్నారు. రన్ యొక్క నాల్గవ ఎడిషన్ ను జరుపుతున్నట్టు చెప్పారు. కోసం టీ షర్టును ఆవిష్కరించారు. పిల్లలలో రెటినోబ్లాస్టోమా (కంటి క్యాన్సర్) ను ప్రారంభంలో గుర్తించడం మరియు దాని చికిత్స కోసం నిధుల గురించి అవగాహన పెంచడానికి ఎల్ వీ పీఈఐ మే 11 నుంచి 17 మధ్య ప్రపంచ రెటినోబ్లాస్టోమా అవేర్‌నెస్ వీక్ జ్ఞాపకార్థం జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమం 2018 లో హైదరాబాద్‌లో ప్రారంభమైందని, అప్పటి నుండి ఎల్ వీపీఈఐ విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్ కేంద్రాలకు విస్తరించిందన్నారు. ఈ రన్‌లో పాల్గొనేవారు తమ పేర్లు నమోదు చేసుకోవడానికి 92472 43377 నంబర్ కు కాల్ చేయవలసిందిగా కోరారు.

## 2024-25 ఒలింపియాడ్ అవార్డుల్లో గుంటూరు విద్యార్థుల ప్రతిభ




**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఎస్ఓఎఫ్ ఒలింపియాడ్ 2024-25 పరీక్షలో నగరానికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అలెన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆరో గ్రేడ్ విద్యార్థి గొంతు శివ జగదీశ్వర్ రెడ్డి ఇంటర్నేషనల్ మేథమెటిక్స్ ఒలింపియాడ్‌లో నాల్గవ ర్యాంక్ సాధించి, మెరిట్ సర్టిఫికెట్ పొందారు. అదే స్కూలుకు చెందిన 8వ గ్రేడ్ విద్యార్థి భోగిరెడ్డి శశికిరణ్ సైతం మేథమెటిక్స్ ఒలింపియాడ్‌లో నాల్గవ ర్యాంక్‌ను సాధించి మెరిట్ సర్టిఫికెట్ అందుకున్నాడు. విట్ ఒలింపియాడ్ స్కూల్ సెకండ్ గ్రేడ్ విద్యార్థి గొల్లపూడి రోషన్ సాయి శర్మ, అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో ఐదో ర్యాంక్‌ను సాధించి, మెరిట్ సర్టిఫికెట్ పొందాడు. 2024-25 విద్యా సంవత్సరంలో అంతర్జాతీయ ఒలింపియాడ్ విజేతలు, ఉపాధ్యాయులను గుర్తించడానికి ఎస్ఓఎఫ్, ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఒక సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించింది. భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె. మహేశ్వరి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

## సినిమా థియేటర్లను తనిఖీ చేసిన తహసీల్దార్



**నందిగామ, మే 28, మేజర్ న్యూస్ :** సినిమా థియేటర్లలో టికెట్లు, శీతల పానీయాలు,తినుబండారాలు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ నూతక్కి సురేష్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు సినిమా థియేటర్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. థియేటర్లకు సంబంధించిన లైసెన్స్ లను,పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. యాజమాన్యం కల్పిస్తున్న సౌకర్యాలను, పరిసరాలను పరిశీలించి ఆరా తీశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం థియేటర్లను నడపాలి తప్ప నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో మండల రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న దొంగ అరెస్ట్

### రూ.3.50 లక్షల విలువ గల బంగారం, వెండి స్వాధీనం



**పమిడిముక్కల మే 28 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు చేసిన కేసుకు సంబంధించి ఒక దొంగను అరెస్ట్ చేసినట్లు గుడివాడ డిఎస్పి వి.ధీరజ్ వినీల్ తెలిపారు. బుధవారం సాయంత్రం పమిడిముక్కల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. రాత్రి సమయంలో ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్థులపై నిఘా ఉంచి మొవ్వ గ్రామానికి చెందిన కాగిత పవన్ కుమార్ ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ముద్దాయి రోజువారి కూలి పనులు చేస్తూ ఆరోజు ఏ పని దొరికితే ఆ పనికి వెళ్లి పగటి సమయంలో ఇళ్ళకు తాళాలు వేచి ఉండటాన్ని గమనిస్తాడని, తన స్నేహితులైన షేక్ బాబావలి, జక్కుల చందురాజ్ ప్రసాద్ బాబులతో కలిసి పనికి వెళుతూ ఇతర ప్రాంతాల్లో నివసించే వారి యొక్క వివరాలు సేకరించి, తాళం వేసి ఉన్న సమయంలో రాత్రిపూట ఆ ఇంటికి వెళ్లి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి దొంగతనాలు చేస్తాడని వివరించారు. ముద్దాయి విలాసాలకు అలవాటు పడి సంపాదన మోజులో కృష్ణా జిల్లాలో పలు దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఆయన తెలిపారు. పమిడిముక్కల పోలీస్ స్టేషన్ పరిధిలోని గడ్డిపాడు అడ్డరోడ్డు సమీపంలో కరెంట్ ఆఫీస్ ముందు ముద్దాయిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి బంగారు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. గత ఏడాది అక్టోబర్ 23వ తేదీన మేడూరు గ్రామంలో దొంగతనానికి పాల్పడి బంగారం, వెండి వస్తువులు దొంగిలించినట్లు చెప్పగా, అతని వద్ద లభించిన వస్తువులను తనిఖీ చేశామని, ఆ వస్తువులు పమిడిముక్కల పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ నెంబర్ 207,160 లకు చెందినవిగా గుర్తించామన్నారు. ముద్దాయిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి రూ.3,50,000 విలువ గల 14 గ్రాముల బంగారం, ఒక కిలో వెండి, దొంగతనం చేసేందుకు ఉపయోగిస్తున్న మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముద్దాయిపై గతంలో కూచిపూడి పోలీస్టేషన్ పరిధిలో కూడా నేరాలు చేసినట్లు ఆయన తెలిపారు. అరెస్ట్ చేసిన నిందితుడు పవన్ కుమార్ ను గురువారం ఉదయం ఉయ్యూరు కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఆయన అభినందించారు. పమిడిముక్కల ఎస్సై శ్రీను, హెడ్ కానిస్టేబుల్ రషీద్, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, సుధీర్, సిసిఎస్ ఎస్ఐ స్వామిదాస్, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుళ్లు వేణు, రాంబాబు, ఎ.మస్తాన్ లను ఆయన అభినందించి వారికి నగదు రివార్డును అందించారు. ఈ సమావేశంలో గుడివాడ సిసిఎస్ సిఐ రమణమ్మ, పమిడిముక్కల సీఐ వై.చిట్టిబాబు, ఎస్ఐ బి. శ్రీను పాల్గొన్నారు.

### థియేటర్లలో తినుబండారాలు, ఇతర వస్తువులు

# ఎంఆర్పీ ధరలకు మించి అమ్మ రాదు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** థియేటర్లలో తినుబండారాలు, ఇతర వస్తువులు ఎంఆర్పి ధరలకు మించి అమ్మ రాదని, కాల పరిమితి దాటిన వస్తువులు అమ్మ రాదని నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం ఆర్డిఓ స్వాతి పివిఆర్ థియేటర్ యాజమాన్యాన్ని హెచ్చరించారు.బుధవారం మధ్యాహ్నం నగరంలోని పివిఆర్ థియేటర్ ను మచిలీపట్నం ఆర్డిఓ కే స్వాతి ఆకస్మిక తనిఖీ చేశారు. థియేటర్లో వసూలు చేస్తున్న ఫీజులు తినుబండారాలపై ఉన్న ధరలు, థియేటర్ లైసెన్స్ రికార్డులు ఆర్డీవో పరిశీలించారు.అనంతరం ఆర్డిఓ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచనల మేరకు నగరంలోని పివిఆర్ థియేటర్ ను తనిఖీ చేశామన్నారు. థియేటర్లో తినుబండారాలపై ఉన్న ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా అమ్ముతున్నారా, ఎటువంటి ఫీజులు వసూలు చేస్తున్నారు, ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సీటింగు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ఎలా ఉన్నాయో పరిశీలన చేశామన్నారు. రహదారులు భవనాలు, అగ్నిమాపక శాఖలు, ఫిలిం చాంబరు, ఫుడ్ సేఫ్టీ వారి నుంచి ఎలాంటి అనుమతులు తీసుకుంటున్నారు కూడా సంబంధిత రికార్డులను పరిశీలించామన్నారు. ఇప్పటివరకు చూసిన రికార్డుల ప్రకారం రెండు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వరకు కాల పరిమితితో అనుమతులు ఉన్నాయన్నారు.తనిఖీ చేసిన తినుబండారాలు వస్తువులు ముఖ్యంగా నీళ్ల సీసాలు, తంసప్ వంటి చల్లని పానీయాలు కాలపరిమితి దాటినవి ఏమైనా ఉన్నాయా అని గమనించామన్నారు. వాటిలో ఒకటి ఈనెల 25వ తేదీకి కాల పరిమితి దాటినట్లు గుర్తించామన్నారు. ఆ విషయమై థియేటర్ యాజమాన్యాన్ని విచారించితే పొరపాటు జరిగిందని యాజమాన్యం చెప్పారన్నారు. ఇకపై థియేటర్ యాజమాన్యం ప్రతిరోజు వారు వాడుతున్న, అమ్ముతున్న వస్తువులను గమనించి కాల పరిమితి దాటినవి ఎట్టి పరిస్థితుల్లో లేకుండా చూడాలని సూచించామన్నారు. ఈ తనిఖీలో ఆర్డిఓ వెంట తహసిల్దారు నాగభూషణం రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు



## అనిగండ్లపాడులో ఎన్ఆర్‌జిఎస్ అవినీతిపై రసాభాస

### విచారణకు వచ్చిన అధికారిని కదలనివ్వని వైనం

### ఎట్టికేలకు పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన గొడవ

**పెనుగంచిప్రోలు, మే 28, మేజర్ న్యూస్ :** అనిగండ్లపాడు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగిన గ్రామస్తులు,ఎన్.ఆర్.జై.యస్ ఫీల్డ్ స్టాప్ రమణ ఎటువంటి అక్రమాలు చేయలేదని,అందరం పనికి వెళ్లి పనిచేస్తేనే మా అకౌంట్‌లో డబ్బులు పడ్డాయని, అతన్ని కొనసాగించాలని ధర్నాకు దిగిన గ్రామస్తులు.అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు. సమాచార హక్కు చట్టం కింద ఫిర్యాదు చేసిన వ్యక్తిని పిలిపించాలని వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు, ఎట్టికేలకు పోలీసులు ఉన్నదా అధికారులకు తెలియజేసి విచారణ చేపట్టి ఎవరిది తప్పైతే వారిపై చర్యలు తీసుకుంటామని పెనుగంచిప్రోలు పోలీస్ వారి సహకారంతో అధికారులను కారు ఎక్కించగా, కారుని సైతం అడ్డుకున్న గ్రామస్తులు. పెనుగంచిప్రోలు ఎస్ఐ పంచాయతీ కార్యాలయం వద్దకు విచ్చేసి సంబంధిత గొడవ చేస్తున్న వారితో మాట్లాడి ఇలా గొడవలు దిగితే ప్రయోజనం ఉండదని మీరు కూడా మీకు జరిగిన సమస్యపై ఫిర్యాదు చేస్తే తగిన విచారణ చేపడతామని ఆయన అన్నారు.

# మోటార్ సైకిల్ చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

**కృత్తివెన్ను మే 28 మేజర్ న్యూస్ :** చెడు వ్యసనాలకు అలవాటు పడి మోటర్ సైకిల్ దొంగతనం చేస్తూ వాటిని అమ్మి ఆ సొమ్ముతో తన కోరికలను తీర్చుకుంటున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన విల్లురి సుదీర్ బాబు ను కృత్తివెన్ను ఎస్ఐ ఏ పైడి బాబు అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. బుధవారం సిఐ కె.నాగేంద్ర ప్రసాద్ కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం కృత్తివెన్ను మండలం పల్లిపాలెం పిన్నేరు వంతెన వద్ద ఎస్సై పైడి బాబు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు నెంబర్ బోర్డు, ఎటువంటి పత్రాలు లేకుండా మోటార్ సైకిల్ పై అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించారు దీంతో వారిని తీసుకువచ్చి విచారణ చేయగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం యనముదుర్రు గ్రామానికి చెందిన విల్లూరి సుధీర్ బాబు వయసు 19 చెడు వ్యసనాలకు అలవాటై బంటుమిల్లి, కృత్తివెన్ను, గూట్లపాడు తదితర గ్రామాలలో మోటర్ సైకిల్ దొంగిలించి పల్లిపాలెం వద్ద ఉన్న పిన్నేరు వంతెన సమీపంలోని ముళ్ల పొదల్లో వాటిని దాచి ఉంచినట్లు తెలిపారు. ఎవరికి అనుమానం రాకుండా ఒక్కొక్కటి తీసుకువెళ్లి అమ్ముకుంటున్నాడు అందులో భాగంగానే బుధవారం పల్లిపాలెం గ్రామంలో వేరొక వ్యక్తితో కలిసి మరో బైక్ దొంగతనం చేసి తీసుకు వెళుతుండగా పోలీసులకు దొరికిపోయినట్లు వివరించారు. పూర్తిస్థాయిలో విచారణ చేయగా తన దొంగతనం చేసిన మోటార్ సైకిళ్ళు ఎక్కడ ఉంచింది పోలీసులకు తెలపడంతో వారు ఆ మోటర్ బైక్ లను పోలీస్ స్టేషన్ కు తరలించి ఆ యువకుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసు లో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ పైడి బాబును, పోలీస్ కానిస్టేబుల్ 2747,1729 లను జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, డిఎస్పి సిహెచ్ రాజు, సీఐ నాగేంద్ర ప్రసాద్ అభినందించి రివార్డులను అందించారు. యువత చెడు వ్యసనాలకు బానిసై వారి అవసరాలు తీర్చుకునేందుకు చెడు మార్గంలో పయనిస్తూ చిన్నతనంలోనే తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు ఎక్కడ ఉంటున్నారు ఏం చేస్తున్నారు అనేది ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ ఉండాలని సిఐ నాగేంద్ర ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పైడి బాబు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# మానవ హక్కులను కాలరాస్తున్న ఏపీ ప్రభుత్వం

## బీఎస్పీ ఎంపీటీసీ ఉదయ్ కిరణ్ డిమాండ్



**కంచికచర్ల మే 28 మేజర్ న్యూస్ :** చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే కూనీ చేస్తుంటే ఇంకా సామాన్యుల పరిస్థితి ఏమిటి, గంజాయి సేవించడం నేరమే మరి గంజాయిని పెంచి పోషిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏమనాలి అని బిఎస్పి పార్టీ ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నించారు.మాయా కూటమి అధికారాలోనికి రాకముందు బహుజన కులాల అభ్యున్నతికి కృషి చేస్తామని వారి యువతను పారిశ్రామికంగా, ఉద్యోగ పరంగా అభివృద్ధి పరుస్తూ ఆర్థిక పురోగతిని సాధిస్తామని మేక వన్నె కథలు ఎన్నో చెప్పారని,తీరా వారు అధికారంలోనికి వచ్చిన తర్వాత తమ యొక్క ఊసరవల్లి నిజస్వరూపాన్ని రోజురోజుకు బయటపెడుతున్నారని బిఎస్పి ఎంపీటీసీ బర్రె ఉదయ కిరణ్ దిగిబట్టారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తూ ఇటీవల తెనాలిలో జరిగిన సంఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. ఈ సంఘటనని ప్రజాస్వామ్యవాదులు,రాజ్యాంగ పరిరక్షకులు,మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించాలని ఆయన కోరారు. తెనాలిలో గంజాయి మత్తులో కొంతమంది దళిత మైనార్టీ యువకులు పోలీసులను దుర్భాషలాడారుఅనే నెపంతో చేబ్రోలు జాన్, షేక్ బాబూలాల్, దోమ రాకేష్ అనేవారును తెనాలి 2 టౌన్, 3 టౌన్ సిఐ లు వారి యొక్క సిబ్బంది విచక్షణను కోల్పోయి పశువును బాదినట్లు సభ్య సమాజం చూస్తుండగా యువకులను కొట్టడం అనేది అనాగరిక చర్య అని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఈ సంఘటనను సుమోటోగా తీసుకొని సంబంధిత సంఘటన మీద దర్యాప్తు జరిపించి అధికారులను కఠినంగా శిక్షించాలని ఉదయ్ కిరణ్ డిమాండ్ చేశారు.

## చోరగుడిలో ఏపీ సీడ్స్ వరి విత్తనాల పంపిణీ



**పమిడిముక్కల మే 28 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని చోరగుడి రైతు సేవా కేంద్రంలో ఏపీ సీడ్స్ సరఫరా చేసిన వరి విత్తనాలను గ్రామ సర్పంచ్ కందిమళ్ళ పూర్ణకుమారి రైతులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధిక దిగుబడులు సాధించుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ పూర్ణ కుమారి రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా ఎంటియు 1061, ఎంటియు 1318 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని అవసరమైన రైతులు కొనుగోలు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యేశ్వర రావు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీపీఐ పార్టీ గోడ పత్రిక ఆవిష్కరణ



**తిరువూరు మేజర్ న్యూస్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) స్థానిక సుంకర వీరభద్ర రావు భవన్‌లో బుధవారం గోడ పత్రిక ను ఆవిష్కరించారు, జూన్ రెండవ తేదీన మండల కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ ఈ సందర్భంగా తెలియజేశారు, రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు,ఇళ్ల స్థలాలు వెంటనే అందజేయాలని, ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం 5 లక్షల రూపాయలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని, దీనిపై జూన్ రెండో తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎస్కే సుభాని, పాలకుర్తి సునీల్, పల్లపు మురళి, ఎస్కే హసన్, నాగూర్, యాకూబ్, ఎస్ కుమార్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాన్ని పరిశీలించిన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి



**పెదపారుపూడి మేజర్ న్యూస్:** వేసవి శిక్షణా తరగతులలో భాగంగా పెదపారుపూడి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు"బృంద చర్చ"పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వేములపల్లి రవి కుమార్ ఈ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న అంతర్గత శక్తులు వెలికితీసే అద్భుతమైన వ్యవస్థ గ్రంథాలయం అని, ఇటువంటి గ్రంథాలయ సందర్శనను ప్రతి విద్యార్థి తన నిత్య జీవితంలో ఒక భాగం చేసుకోవాలి అని, కేవలం గ్రంథాలయం ద్వారా చదువుకుని మహోన్నత స్థాయిలో ఎందరో మహానుభావులు నిలిచారని పేర్కొన్నారు. వేసవి శిక్షణా తరగతుల పరిశీలనలో భాగంగా గ్రంథాలయానికి విచ్చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులు నేర్చుకున్న వివిధ రకాల విద్యా విషయాలపై ప్రశ్నలు అడిగి, విద్యార్థులు నుంచి సమాధానాలు రాబట్టారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎంవీఎస్ లక్ష్మి, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాడంకిలో వైభవంగా రామాలయ నిర్మాణ శంకుస్థాపన



**పమిడిముక్కల మే 28 మేజర్ న్యూస్ :** మండలంలోని తాడంకి గ్రామంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి నూతన దేవాలయ నిర్మాణానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఆగమ శాస్త్ర ప్రకారం వేద పండితులు కుందుర్తి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు, హోమాలు జరిపించి వేదమంత్రాల నడుమ గ్రామస్తులతో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రామకోటి పుస్తకాలు, శ్రీరామ్ అని వ్రాసి ప్రత్యేకంగా పూజలు చేసిన ఇటుకలతో భక్తులు జై శ్రీరామ్ అంటూ భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. గణపతి పూజ, పుణ్యాహవాచన, వాస్తు పూజ,వాస్తు హోమం, పూర్ణాహుతి, కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, మాజీ సర్పంచి జక్కా శ్రీనివాసరావు, వ్యాపారవేత్త నూకల వెంకట సాంబశివరావు, నాయకులు యలమం చిలి సుధాకర్, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

## ఘనంగా ఆలయ నిర్మాణ పునర్వ పునః ప్రతిష్ట



**విసన్నపేట మేజర్ న్యూస్ :** స్థానిక పట్టణంలోని ద్వారకా నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ మహాతల్లి పుణ్యక్షేత్రం సరిహద్దుగా ఏర్పాటు చేసిన దేవాలయంలో నాగేంద్ర స్వామి, అంకమ్మ తల్లి విగ్రహాల పునః పూజ, శాంతి హోమము మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలు నడుమ అంగరంగ వైభవంగా బుదవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై వల్లభనేని గిరి, తల్లిదండ్రులు వల్లభనేని వెంకటేశ్వరరావు, రాణి, దంపతులు విస్సన్నపేట మాజీ సర్పంచ్ నెక్కలపు. నాగమణి శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**గన్నవరం, మే 28, మేజర్ న్యూస్:** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో.. 33/11కేవీ వీరపనేనిగూడెం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం రేపు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు శేష సాయి గార్డెన్, ఐటిఐ కాలేజ్ రోడ్డు, బి బి గూడెం రోడ్డు, బిబి గూడెం, వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కంద్రిక, కొత్తగూడెం, చిక్కవరం. చింతగుంట, గొల్లనపల్లి, స్లేట్ స్కూల్ ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును. కావున గృహ వినియోదారులు, వ్యాపార వినియోగదారులు, వ్యవసాయ వినియోగదారులు, పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

## సినిమా థియేటర్లలో ధరలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### తహసీల్దార్ వేమూరు మానస



**కంచికచర్ల మే 28 మేజర్ న్యూస్ :** సినిమా థియేటర్లలో టికెట్లు, శీతల పానీయాలు, తినుబండారాలు ఎమ్మార్పీ ధరల కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కంచికచర్ల మండల తహసిల్దార్ వేమూరి మానస హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు సినిమా థియేటర్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. థియేటర్లకు సంబంధించిన లైసెన్స్ లను,పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. యాజమాన్యం కల్పిస్తున్న సౌకర్యాలను, పరిసరాలను పరిశీలించి ఆరా తీశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం థియేటర్లను నడపాలి తప్ప నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

## మహానాడులో మేకల సుధాకర్ జన్మదిన వేడుకలు



**చందర్లపాడు, మే 28, మేజర్ న్యూస్:** దేవుడి గడప కడపలో మహానాడు కార్యక్రమంలో చందర్లపాడు మండల నాయకులు భారీగా పాల్గొన్నారు. బుధవారం నాడు చందర్లపాడు మండల పార్టీ అధ్యక్షులు మేకల సుధాకర్, మండల ఐటీడీపి అధ్యక్షులు గోపీచంద్ చౌదరి చందర్లపాడు మండల ఐటీడీపి కో ఆర్డినేటర్ అనిల్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, సీనియర్ టీడీపీ నాయకులు ఉన్నం నరసింహారావు, మండల టీడీపీ నాయకుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైయస్సార్ కార్యకర్తలకు పరామర్శ ఆర్థిక భరోసా



**పెనుగంచిప్రోలు:మే 28 మేజర్ న్యూస్ :** మండలంలోని శివాపురం గ్రామంలోలి పలువురునీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ నెడ్ క్యాప్ కార్పొరేషన్ ఛైర్మెన్ వేల్పుల రవికుమార్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు వట్టేం మనోహర్ పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.మండలానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త తిరుపతమ్మ తల్లి దేవస్థానం మాజీ సభ్యులు కురువేళ్ల రాయప్ప, తుమ్మల గోపి మాజీ ఎంపీటీసీ సభ్యులు మాదుగుల శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త తుమ్మల విశ్వనాథం ఇటివల అనారోగ్య కారణంగా హాస్పిటల్ లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన సంగతి తెలిసి వారిని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అలాగేతుమ్మల మల్లయ్య అనారోగ్య కారణంగా చనిపోయిన సంగతి తెలిసి వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి శీలం మంగారావు జగ్గయ్యపేట పట్టణ ఉపాధ్యక్షులు దివ్వెల రామారావు పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్ గ్రామ మాజీ సర్పంచ్ లగడపాటి మోహన్ రావు గ్రామ పార్టీ అధ్యక్షులు లగడపాటి జనార్దన్ రావు, ఏలూరు శ్రీనివాసరావు, ఏలూరు వెంకటరమణ,లగడపాటి కృష్ణారావు, తుమ్మల రామారావు, దైద వినోద్ కుమార్,కొనకంచి చిరంజీవి, తుమ్మల తమ్మీ, దైద కృష్ణ, గ్రామ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# వాహన చోదకులకు మానసిక ప్రశాంతత అవసరం

**మానసిక ప్రశాంతతను ప్రసాదించే యోగాను ఆచరించాలి : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**















**ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, మే 28, మేజర్ న్యూస్ :** మానసిక ప్రశాంతత ద్వారానే ప్రమాద రహిత సురక్షితమైన ప్రయాణం చేయగలుగుతామని, మానసిక ప్రశాంతతను ప్రసాదించే యోగాసనాలకు వాహన చోదకులు కొంత సమయాన్ని కేటాయించాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. యోగాంధ్ర-2025 మాసోత్సవాల సందర్భంగా బుధవారం విజయవాడలోని బీఆర్‌టీఎస్ యోగాస్ట్రీట్‌లో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహన చోదకులకు నిర్వహించిన ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. వాహన చోదకులతో కలిసి కలెక్టర్ యోగాసనాలను అభ్యసించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ముఖ్యంగా వాహన చోదకులకు మానసిక ప్రశాంతత అవసరమని, ఏమాత్రం ఒత్తిడికి లోనైనా ప్రమాదాలు బారినపడే అవకాశాలు ఉంటాయన్నారు. డ్రైవర్లు ప్రతిరోజూ ఎంతో కొంత సమయాన్ని యోగాసనాలకు కేటాయించాల్సిన అవసరముందన్నారు. డ్రైవర్లలో అవగాహన కల్పించేందుకు యోగాంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో డ్రైవర్లకు యోగాసనాల శిక్షణ, అవగాహన కల్పిస్తున్నామని, తద్వారా ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు.. ఇలా సమాజంలోని ప్రతివర్గానికి యోగాను చేరువచేసేందుకే థీమ్ యోగాను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, వీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.చంద్రశేఖర్, ఆర్‌టీవోలు ఆర్.ప్రవీణ్, కె.వెంకటేశ్వరరావు, రవాణాశాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షులు ఎం.రాజుబాబు, రవాణాశాఖ కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షులు కె.భద్రాచలం (రాజా), ఆటో యూనియన్ నాయకులు, లారీ యూనియన్ నాయకులు, డ్రైవర్లు, రవాణాశాఖ అధికారులు, సిబ్బంది, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, ఆయుష్ అధికారి డా. రామతల్లేహి, మెడికల్ ఆఫీసర్ డా. వై.రత్న ప్రియదర్శిని, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, నగర ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నగర పాలక వార్డ్, సర్కిల్ స్థాయిలలో యోగాంధ్ర పోటీలు





**జూనియర్, యంగ్, సీనియర్ గ్రూప్ కేటగిరీల్లో పోటీలు**

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా వార్డ్, సర్కిల్ స్థాయి యోగా పోటీలు జరగనున్నాయని.. వార్డ్ స్థాయి విజేతలు సర్కిల్ స్థాయికి, సర్కిల్ స్థాయి విజేతలు జిల్లాస్థాయికి, జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తారని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం కనకదుర్గ వారధి వద్దగల రివర్ ఫ్రెంట్ పార్క్ లో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని, నగర ప్రజలకు పిలుపునిచ్చారు. ఆసనాల ప్రదర్శన (సూర్య నమస్కార్ ఛాలెంజ్, ప్రాణాయామం, మెడిటేషన్), ఆర్టిస్టిక్ యోగా (యోగా సాంగ్, యోగా పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే), వైజ్ఞానిక యోగా (యోగా క్విజ్, యోగా పోస్టర్, యోగా స్లోగన్, యోగా ఎస్సే), యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీలో పోటీలు జరుగుతాయని, గ్రూప్ విభాగంలో సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా, మిక్స్‌డ్ ఏజ్ గ్రూప్ యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్ గ్రూప్ (10-18 ఏళ్లు), యంగ్ గ్రూప్ (19-35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని.. వార్డు స్థాయి పోటీలు మే 26 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని.. ఔత్సాహికులు ఆయా వార్డ్ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. యోగా స్లోగన్, యోగా షార్ట్‌ఫిల్మ్, యోగా ఫొటోగ్రఫీ విభాగాల్లో పోటీపడాలనుకునే ఔత్సాహికులు తమ ఎంట్రీలను జూన్ 10వ తేదీలోగా vmcyogandhra@gmail.com మెయిల్‌కు పంపించాల్సి ఉంటుందని, తమ ఎంట్రీలతో పాటు పేరు, చిరునామా, మొబైల్ నంబరు వివరాలను తెలియజేయాలి. వివిధ పోటీల్లో విజేతలకు అవార్డుల ప్రదానం ఉంటుందని, ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కే షమీ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) విభాగం పి వెంకట నారాయణ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## సముద్ర తీరంలో వాలీబాల్ స్పోర్ట్స్ మీట్ 2025

**కోడూరు మేజర్ న్యూస్:** కోడూరు మండలం పాలకాయ తిప్పలో కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో సముద్ర తీరంలో వాలీబాల్ స్పోర్ట్స్ మీట్ 2025 నిర్వహించారు. పాలకాయతిప్ప, తీర ప్రాంత గ్రామాల నుంచి వాలీబాల్ టీమ్స్ పాల్గొన్నాయి. డాల్ఫిన్ బాయ్స్ జట్టు, షార్క్ ఫైటర్స్ జట్టు ఫైనల్ పోరులో పాల్గొన్నాయి. హోరాహోరీ పోరులో డాల్ఫిన్ బాయ్స్ జట్టు విజయం సాధించింది. సీఐ సురేష్ రెడ్డి బహుమతులు అందచేశారు.

## తీర గ్రామాలకు ఉచిత తాగునీరు




**కోడూరు మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో తీర గ్రామాలకు ఉచిత తాగునీరు సరఫరా చేశారు. బుధవారం కోడూరు మండలం ఇరాలి, బసవవానిపాలెం, చింతకోళ్ల గ్రామాల ప్రజలకు ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు.

# భూగర్భ డ్రైనేజ్ సమస్యలపై చర్యలు






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పొంగే భూగర్భ డ్రైనేజీ సమస్యలపై చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా బాలాజీ నగర్, సిమెంట్ గోడౌన్ ప్రాంతం, కృష్ణలంక ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కృష్ణలంక బాలాజీ నగర్ లో భూగర్భ డ్రైనేజ్ పొంగి ప్రజలు ఇబ్బందులు పడుతున్న సందర్భంగా, ఆ సమస్యను తీర్చేందుకు చేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ట్రంక్ లైన్ రిపేరు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భూగర్భ డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందించేటట్టుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సిమెంట్ గోడౌన్ వద్ద అమృత 2.0 పథకం ద్వారా 2.8 కోట్ల నిధులతో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఎటువంటి సమస్యలున్న తమకు తెలుపమన్నారు, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999